

ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం



నేడు వనంగుడి నుంచి చదురుగుడిలోకి పోలమాంబ రాక

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో వేంచేసి ఉన్న పోలమాంబ అమ్మవారి జాతర మహోత్స వాలు సందర్భంగా సోమవారం సాయంత్రం చిన్నమ్మ వారిని గ్రామంలోకి కొనితెచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు దేవాలయం ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. వేద మంత్రోచ్ఛా రణ, మేళతాళాలు, కోలాట బృందాలతో తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యాలతో భక్తులు చిన్నమ్మ వారి గద్దె వద్దకు తరలివెళ్లి సాంప్రదా యం ప్రకారం అమ్మవారికి అన్ని పూజా కార్యక్ర మాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకు రానున్నట్టు తెలిపారు.



పల్లెల్లో సంక్రాంతి సందడి

- సొంతూళ్లకు చేరుకున్న వలస పక్షులు
- రద్దీగా మారిన రోడ్లు
- కళకళలాడుతున్న మార్కెట్లు

పండగ అంటేనే సరదాలు.. సందళ్లు... అందులోనూ సంక్రాంతి అంటే తెలుగు వారింట చెప్పలేనంత అనుభూతి. స్నేహితులు, రక్త సంబంధీకుల అనురాగం. ఆప్యాయత పంచుకునే పర్వదినాలు. పండగకు కొద్దిరోజుల ముందు నుంచే పిండివంటకాలు ఘుమఘుములాడేవి. నూతన వస్త్రాలు, కిరాణా సామగ్రి తదితర సరుకుల క్రయ విక్రయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కళకళలాడేవి. ఇదంతా ఒకప్పటి మాట. మారిన ప్రభుత్వ విధానాల వల్ల నేడా పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజానీకమే కాదు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం సమస్యలతో సతమతమౌతూ పండగ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఏటా సర్కారు సంక్రాంతి సంబరాలు నిర్వహించేది. ఈసారి అది కూడా కానరాకపోవడంతో మునుపటితో పోలిస్తే సంక్రాంతి సందడి ఒకింత తగ్గిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

పల్లెల్లో సంక్రాంతి సందడే మొదలైంది. సంక్రాంతికి నెలరోజుల ముందే.... అంటే నెలగంటు పెట్టినప్పటి నుంచీ రోజూ క్రమం తప్పకుండా ఇళ్లు అలుక్కోవడం (శుభ్రం చేసుకోవడం), సున్నాలు వేసి ప్రత్యేకంగా ముస్తాబు చేయడం వంటి పనులు ప్రారంభిస్తారు. మూడు రోజుల సంక్రాంతి సంబరంలో భాగంగా సోమవారం భోగి వేడుకలతో ప్రారంభమైంది. మంగవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగ నిర్వహించుకోనున్నారు. పండగను సొంత ఊళ్లలో జరుపుకోవడానికి జనం పట్టణాలు వదిలి, కుటుంబాలతో పల్లెలకు చేరుకున్నారు. రెండు రోజులుగా పట్టణాల నుంచి కుటుంబ సభ్యుల రాకతో ప్రతి ఇల్లు సందడిగా మారింది. పిండివంటల ఘుమఘుమలు, ఇంటి ముందు అందమైన రంగవల్లులు, గొబ్బిమ్మలు... బసవ్వన్నలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేకశోభను సంతరించుకుంటున్నాయి. ఉత్తరాయన పుణ్య కాలంలో మార్గశిర పుష్యమాసాల్లో సంక్రాంతి వస్తుంది. సూర్యుడు ఒక్కో మాసంలో ఒక్కో రాశిలోకి మారుతూ 'మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతిగా చెప్పుకుంటారు. సంక్రాంతి ఎన్నెన్నో సంప్రదాయాలతో ముడిపడి ఉంది. ఆధునిక పోకడలతో పండుగల్లో కొంత కళ తగ్గిపోతున్నా రంగవల్లులు తీర్చిదిద్దడంలో మహిళలు మాత్రం పోటీ పడుతూనే ఉన్నారు. చిన్నారులు పతంగులతో సందడి చేస్తున్నారు. సంక్రాంతిలో భాగంగా ఇళ్ల ముందు వేసే ముగ్గుల్లో గొబ్బెమ్మలు ముఖ్యమైనవి. ఆవుపేడతో ముద్దలు చేసి ముగ్గుల మధ్యన పెట్టి పసుపు, కుంకుమ అద్ద పిండితో ముగ్గులు వేసి ఏర్పాటు చేస్తారు. ఈ గొబ్బెమ్మను. గౌరీదేవిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటారు. పసుపు, కుంకుమ పెసరపప్పు, శెనగలు, మరమరాలు (పెలాం), అటుకులు మొదలైన వాటితో పూజలు చేసి పంచుకుంటారు. భోగితో సంక్రాంతిని స్వాగతిస్తారు. ప్రతి ఇంటి ముందు భోగిమంటలు వేస్తారు. పల్లెల్లో భోగి మంటల సంప్రదాయం ఇంకా ఉన్నా పట్టణాల్లో మాత్రం కనుమరుగైపోయింది. భోగి మంటల చుట్టూ తిరుగుతూ ఆ మంటలతో కాగిన నీళ్లతో స్నానం చేస్తారు. ఈ స్నానాలతో దుష్టశక్తులు తొలగిపోయి సంతోషంగా ఉంటారని భావిస్తారు.





పార్వతీపురం రైల్వే స్టేషన్ నుంచి సొంత గ్రామాలకు వెళ్తున్న ప్రయాణికులు

భోగి పండ్లతో చిన్నారులకు ఆశీర్వాదం

భోగిపండ్లు అంటే రేగు పండ్లు సూర్యుడి రూపం. రంగు పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలు కలిపి పిల్లలపై పోసి ఆశీర్వదిస్తాడు. పిల్లలు కూడా ఎంతో సంబరంగా వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం వేళ మహిళలు బొమ్మలకొలువు నిర్వహిస్తారు.

నోరూరించే ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే ముందుగా అందరికీ గుర్తొచ్చేది పిండివంటలు, నోరూరించే ఘుమఘుములు స్వాగతం పలుకుతాయి. ప్రతి ఇంటా పలురకాల పిండి వంటలను తయారు చేస్తారు. చిన్నా పెద్ద ఎంతో ఇష్టంగా తింటారు. కనుమ రోజున నాటుకోళ్ల, గారెలు ప్రధాన వంటలుగా చేస్తారు.

స్వగ్రామాలకు చేరుకుంటున్న వలస పక్షులు

పార్వతీపురం టౌన్ : ఉపాధి, ఉద్యోగాల కోసం సొంతూళ్లను, తల్లిదండ్రులను, బంధుమిత్రులను, రక్తసంబంధీకులను వదిలి దూర ప్రాంతంలో ఉండే వారంతా సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు తమ స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్, చెన్నై నుంచి వచ్చే ప్రతి రైలు నుంచి పెద్దఎత్తున సొంత ఊళ్లకు రావడంతో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడాయి. రైలు దిగిన ప్రతివారి చేతుల్లోనూ, తలపై బ్యాగులు దర్శమించ్చాయి.

సంక్రాంతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

భోగీ, సంక్రాంతి, కనుమ పండగలు ఆనందోత్సాహాలతో జరుపుకొని ప్రజలు ఏడాది మొత్తం ఉత్సాహంతో పనిచేసి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు కార్యక్రమాల్లో రెండో రోజు ఆదివారం ఆయన భోగిమంటలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు భోగి పళ్ళ సంబరాన్ని నిర్వహించారు. ఎడ్లబండి నడిపి అందరిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారికే సొంతమైన పండగలను ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో నిర్వహించుకుని ఆనందంగా ముందుకు సాగాలని కోరారు. తెలుగు సంస్కృతిని చాటే ఈ సంబరాల్లో జిల్లాలోని ప్రజలంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్య శాఖల అధికారులతో పాటు పట్టణానికి చెందిన వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎడ్ల బండిని తోలుకెళ్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ముగిసిన సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాలు వేడుకలు ఆదివారం ముగిసాయి. జానపద సంగీతం, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించారు. బుల్లి తెర జబర్దస్త్ నటుల ఈవెంట్లు వినోదాన్ని పంచాయి. బుల్లెట్ బండి రమణ జానపద గీతాలాపణ, కాంతార నటన ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, డిఇఒ ఎన్ తిరుపతినాయుడు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, పలువురు అధికారులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న జబర్దస్త్ బృందం, పల్సర్ బైక్ రమణ

ప్రజలు సుభిక్షంగా ఉండాలి


గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



ప్రజలంతా భోగ భాగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలన్నదే కూటమి ప్రభుత్వం ఆశయ మని మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. గ్రామాల్లో పాడి సంపద అభివృద్ధి చెంది, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అన్ని రంగాలు ప్రగతి బాటలో పయనించాలని కోరారు. ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొంగొత్త ఆశలు, ఆశయాలు నెరవేరి సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రైతుల ఇంట ధన, ధాన్యాభివృద్ధి చెంది సుభిక్షంగా ఉండాలని కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి సమష్టి కృషి సాగిద్దామన్నారు.

జిల్లాలో రూ.5 కోట్లతో గోకులాలు : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలోని ఐదు కోట్ల రూపాయలతో గోసాలల నిర్మిస్తున్నట్లు రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. మండలంలోని మాతుమూరులో జరిగిన సంక్రాంతి సంబరాల్లో శనివారం పాల్గొని గోకులాలు ప్రారంభించారు. ముందుగా భోగి మంటను వెలిగించి అందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు వేసిన రంగవల్లులు తిలకించి అభినందించారు. హరిదాసు వేషధారణలో ఉన్న చిన్నారులను చూసి వారితో సరదాగా ముచ్చటించించారు. చిన్నారులపై భోగి పళ్లు వేసి, గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి గోకులాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిని గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుసంపద పెంపొందించేందుకు, జీవాల సంరక్షణకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధి గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. సాలూరు నియోజవర్గంలో సుమారు కోటి రూపాయల వరకు, పాచిపెంటలో రూ.32 లక్షల వ్యయంతో గోశాలలు, పాంచాలిలో 5, నెల్లివలసలో 4 వరకు గోశాలలు నిర్మాణాలు జరగనున్నట్లు వెల్లడించారు. ఇంకా అవసరం మేరకు పాడి రైతులకు గోశాలలు మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే ఏ ఒక్క గిరిశిఖర గ్రామాల్లో తాగునీరు, రోడ్లు సమస్య లేవు అనే మాట రాకుండా ఏడాదిలోగా పూర్తి చేస్తామని చెప్పారు. గిరిశిఖర గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా రహదారి సౌకర్యానికి ప్రణాళికా బద్ధంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వంద రోజుల్లో వంద రహదారుల పనుల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. గ్రామాల పరిశుభ్రతకు అందరూ బాధ్యత వహించాలని, తద్వారా అంటు వ్యాధులు, విష జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు పాటించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపిడిఒ బివిజె పాత్రో, సిడిపిఒ అనంతలక్ష్మి, సాలూరు సిఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటలు వేస్తున్న మంత్రి సంధ్యారాణి


సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

జైకా నిధులు రూ.137 కోట్లు నిధులు విడుదల చేసి మన్యం జిల్లాలో గల సాగు నీటి ప్రాజెక్టులను అభివద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు వెంగళరావుసాగర్, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, పెదంకలాం ప్రాజెక్టులకు జపాన్ ప్రభుత్వం నుంచి జైకా నిధులు రూ.137 కోట్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయని చెప్పారు. జైకా నిధుల కోసం గత 7, 8ఏళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టు అధికారులను జపాన్ పంపించి అనేకమైన శిక్షణలు ఇప్పించి, నిధులు తెప్పించారని అన్నారు. కానీ ఆ నిధులతో పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టులు గత ఐదేళ్ల నుంచి మరమ్మతులు చేయక పూర్తిగా మట్టిపూడుకుపోయి చివరి భూములకు నీరందే పరిస్థితి లేదన్నారు. వెంగళరాయసాగర్, ఒట్టిగెడ్డ ప్రాజెక్టుల పరిధిలో రైతులే ప్రొక్లెయిన్లతో గత ఖరీఫ్ సీజన్లో పనులు చేయించుకున్నారని చెప్పారు. చివరి భూములకు నీరు తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అలాగే కాలువల మరమ్మతులు జరగకపోవడంతో పూర్తిస్థాయిలో చివర భూములుకు నీరందక పంటలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, స్థానిక మంత్రి సంధ్యారాణి చొరవ తీసుకొని వట్టిగడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుల పరిధిలో గల జైకా నిధులు తెప్పించి పూర్తిస్థాయిలో కాలువలు లైనింగ్ పనులు చేయించాలని కోరారు. చివరి భూమి వరకు నీరు వెళ్లేలా కాలువలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పనులు చేసి బకాయిలు ఉన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్లో నాలుగు ప్రధాన ప్రాజెక్టుల్లో పనులు జరగకపోతే రానున్న రోజుల్లో ప్రాజెక్టు పరిధిలో సగం భూమికి కూడా నీరందే పరిస్థితి ఉండదని చెప్పారు ఇప్పటికైనా పై సమస్యల పరిష్కారం చేయకపోతే రైతులందర్నీ రానున్న బడ్జెట్ సమావేశాల ముందు కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్వామి వివేకానందుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ఆ దిశగా పయనించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జట్టు ఆశ్రమంలో నిర్వహించిన యువజనోత్సవాల వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వివేకానంద విగ్రహానికి పూలదండ వేసి ఘన నివాళ్లు అర్పించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలను తిలకించారు. వివేకానంద వేషాధారణతో రిత్విక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని నలుదిక్కులా చాటి చెప్పి యువతకు స్ఫూర్తిగా నిలిచినందున ఆయన జయంతిని జాతీయ యువ దినోత్సవంగా జరుపుకుంటున్నా మన్నారు. సమాజ సేవలో భాగస్వాములై వ్యక్తిత్వ వికాసానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివేకానంద ప్రేరణతో క్లిష్ట పరిస్థితులను కూడా ఆత్మవిశ్వాసంతో సానుకూలంగా మార్చుకోవాలని హితవు పలికారు. వివేకానంద మంచి మాటలను కార్యదీక్షతో ఆచరిస్తే జీవితంలో సమున్నత వ్యక్తిగా ఎదగవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. జట్టు స్వచ్ఛంద సంస్థ సహకారంతో సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు సంఘంగా ఏర్పడిందన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల యువత వాళ్ళ ఇంటర్నల్‌గా ఏర్పడి చెత్త, వ్యర్థాల సేకరణ జరిగేలా సమష్టిగా భాగస్వామ్యం కావాలని అన్నారు. అనంతరం కోల్‌కత్తాలో నిర్వహించిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు, రజిత, కాంస్య పతకాలు గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ చేతుల మీదుగా పతకాలను అందజేశారు. జట్టు ఆశ్రమంలో నిర్వహించిన వక్తత్వ, వీధినాటక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర ప్రోగ్రాం అడ్వైజర్ శ్రీనివాసన్, సెట్విజ్ సిఇఒ బి.రామ్ గోపాల్, జుట్టు ఆశ్రమ నిర్వాహకులు జి.పద్మజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు సరే, సంక్రాంతి కానుక లేవీ?

- సంప్రదాయానికి భిన్నంగా టిడిపి ప్రభుత్వం
- పేదలకు మొండి చేయి

ప్రజాశక్తి - పార్వతీపురం

తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండగ సంక్రాంతి. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరూ ఆడంబరంగా జరుపుకునే సంబరం ఇది. అలాంటి పండగ పూట టిడిపి ప్రభుత్వం పేదలకు మొండిచేయి చూపింది. గతంలో సంక్రాంతి పండుగకు చంద్రన్న కానుకల రూపంలో కొన్ని వస్తువులను టిడిపి ప్రభుత్వం పంపిణీ చేసింది. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలకు సంక్రాంతి కానుక రూపంలో పిండి వంటలు తయారు చేసుకోవడానికి గోధుమపిండి, బెల్లం, వంటనూనెల పంపిణీ చేసింది. ప్రతి నెలా అందే రేషన్ సరుకులతో పాటు చంద్రన్న కానుకలను పంపిణీ చేసేది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తోంది. మొదటి ఏడాదిలో వస్తున్న సంక్రాంతి పండగకు చంద్రన్న కానుకలను పంపిణీ చేయలేదు. గతంలో ముస్లింలకు రంజాన్ తోఫా, క్రైస్తవుల క్రిస్మస్ పండగకు చంద్రన్న కానుకలను పంపిణీ చేసింది. కానీ ఈ ఏడాదిలో సంక్రాంతికి పేదలకు టిడిపి ప్రభుత్వం మొండిచేయి చూపింది. అసలే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడంతో పేదలు కొనలేని పరిస్థితుల్లో చంద్రన్న కానుకలను అందజేసి ఉంటే ఆనందంగా పండగని జరుపుకునే అవకాశం ఉండేది. అయితే సాంప్రదాయానికి భిన్నంగా టిడిపి ప్రభుత్వం ఈ దఫా సంక్రాంతికి పేదలను నిరాశపరిచింది. ఈ ఏడాది సంక్రాంతి సంబరాలు కూడా సాదాసీదాగా ప్రభుత్వం కార్యాలయాల్లో నిర్వహించారు. జిల్లా స్థాయిలో సంబరాలను కొంత వరకు ఆడంబరంగా నిర్వహించారు. కానీ మండలం, పట్టణాల్లో మాత్రం అధికారులు, అధికారపార్టీ నాయకులు సంక్రాంతి సంబరాలు జరిపిన దాఖలాలు లేవు.

సంక్షేమ పథకాల అమలు కూడా అంతంత మాత్రమే

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలనెలా పింఛను డబ్బులు మాత్రమే అందుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన పథకాలేవీ అమలు కావడం లేదు. అమ్మకు వందనం, మహిళలకు నెలనెలా 1500రూపాయలు, నిరుద్యోగ యువతకు భృతి, బిసిలకు 50 ఏళ్లకే పింఛను మంజూరు వంటి పథకాల అమలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ఇంతవరకు కేలండర్ విడుదల చేయలేదు. దీంతో పేదల చేతుల్లో డబ్బుల్లేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా సంక్రాంతి పండుగ సందడి పెద్దగా కనిపించడం లేదు.



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

తోటపల్లి ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తొలుతస్వామీ వివేకనందకు పూలమాల వేసి, అనంతరం రూ.15 లక్షలతో నిర్మించిన, ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని, షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు. కొత్త దేవాలయాలకు ఫిబ్రవరిలో జరుగు ప్రతిష్ఠా కార్యక్రమానికి పోస్టర్లు, కరపత్రాలు, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయ పునర్ నిర్మాణం కోసం జోలెపట్టి విరాళాలను సేకరిస్తానన్నారు, దేవాలయ అభివృద్ధి కి కృషి చేస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మధు సూధనరావు, మాజీ ఎంపిపి మర్రాపు పురుషోత్తమనాయుడు, మేనేజింగ్ ట్రస్టీ డి.ధనంజయరావు, డాక్టర్ డి. పారినాయుడు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ, డొంకాడ రామకృష్ణ, అంబటి మధుసూదనరావు, ఎంపిటిసి సభ్యులు మరడాన సింహాచలం, సర్పంచ్ ఆవాల సింహాచలం, మార్కొండ పకీరునాయుడు, దాత శ్రీరామ్మూర్తి, కన్వీనర్ శ్రీరామ చంద్రమూర్తి, నల్లాన రవి, మోనంగి ప్రకాష్ ట్రస్టీ లు పాల్గొన్నారు.


వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా సత్యంనాయుడు

పార్వతీపురం రూరల్ : జిల్లా వైసిపి అధికార ప్రతినిధిగా మండలంలోని బాలగొడబ మాజీ సర్పంచి, సీనియర్ నాయకులు మువ్వల సత్యంనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తురాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సత్యం నాయుడుకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మృతుల కుటుంబాలకు కోటి పరిహారం చెల్లించాలి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

తిరుమల తొక్కిసలాటలో మతి చెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రను కూటమి ప్రభుత్వం మంటగలిపిందన్నారు. తిరుమల చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా బోర్డు నిర్లక్ష్యం, ముందు చూపు లేకపోవడంతో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు దుర్మరణం పాలయ్యారని చెప్పారు. లక్షలాది మంది భక్తుల కానుకలు, చందాలతో నడుస్తున్న టిటిడి దేవస్థానం బోర్డులో గత కొంతకాలంగా వ్యాపారుల జోక్యం పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మతుల కుటుంబాలను కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. టిడిపి ప్రభుత్వం లో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్న ప్రతిసారీ ప్రకృతి వైపరీత్యాలతో జన, ఆస్తినష్టం జరుగుతున్నాయని చెప్పారు. వైసిపి హయాంలో ఐదేళ్లలో టిటిడి దేవస్థానంలో ఎలాంటి అపశృతి చోటు చేసుకోలేదని చెప్పారు. లడ్డూ కల్తీ జరిగిందని గగ్గోలు పెట్టిన టిడిపి కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కల్తీ వ్యవహారం పై విచారణ బయటపెట్టాలని, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారంతోనే టిటిడి పవిత్రతని కూటమి ప్రభుత్వం మంటగలిపిందని రాజన్నదొర ఆరోపించారు.



సత్యంనాయుడును సత్కరిస్తున్న రైస్‌మిల్ కార్మికులు

సిపిఎం సీనియర్ నాయకులు వంజరాపునకు సత్కారం

ప్రజాశక్తి - బలిజిపేట

సిపిఎం సీనియర్ నాయకులు వంజరాపు సత్యంనాయుడును రైస్ మిల్లు వర్కర్స్ అండ్ హమాలీస్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైస్ మిల్ కార్మిక సంఘం అధ్యక్షులు పి.అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, బలిజిపేట మండల రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తకోట రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, బద్దన భానుమూర్తి మాట్లాడుతూ రైస్ మిల్ యూనియన్ ఏర్పాటులోనూ, మండలంలో ఉద్యమాన్ని నిర్మించడంలో తీవ్రమైన కృషి చేశారని కొనియాడారు. అలాగే నిరంతరం కార్మికులు, ప్రజల సంక్షేమానికి పరితపించే వారని కొనియాడారు. కార్మికులకు, యజమానికి మధ్య సానుకూల వాతావరణంలో సమన్వయంతో చర్చలు జరిపే వారని, అనేక సందర్భాల్లో ప్రజలపై అలుపెరగని పోరాటం చేసిన సత్యంనాయుడ్ని ఇలా సత్కరించుకోవడం కార్మికులకు, ప్రజలకు ఎంత స్ఫూర్తిని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కార్మికులు కూర్మా, సింహాచలం, సురేంద్ర, నాగయ్య, రామప్పడు, విజయ్, అన్ని మిల్లుల కార్మికులు పాల్గొన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సూపర్ 30 నవోదయ మోడల్ ఫైనల్ గ్రాండ్ టెస్ట్ -2025 నిర్వహించారు. ప్రథమ స్థానం కోటబొమ్మాలికి చెందిన ఎస్.తేజస్విని, ద్వితీయ స్థానం పొందూరుకు చెందిన జి.కేశవ, తృతీయ స్థానం పాయకపాడు గ్రామానికి చెందిన సిహెచ్ యువన్ ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, వాసుదేవరావు, వి.అన్నాజీరావు, ఎ.చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గుళ్లకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - మక్కువ

ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడిన మక్కువ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడ్ని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం పరామర్శించారు. శ నివారం ఆయన తన పొలానికి ద్విచక్రవాహనంపై వెనుకన కూర్చొని వెళ్తుండగా వాహనం స్కిడ్ కావడంతో జారికింద పడిపోయారు. దీంతో ఆయనకు వెన్నుముక దగ్గర దెబ్బ తగిలి చిట్లింది. ఈ విషయం తెలుకున్న మంత్రి వెంకంపేటలో గల వేణు నివాసానికి వెళ్లి పరామర్శించారు.

45 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ హై స్కూల్లో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 19980-81 పదో తరగతి బ్యాచికి చెందిన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులంతా కలిసి తాము చదువుకున్న పాఠశాలలో ఒకచోట కలుసుకొని తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. వారంతా వివిధ రంగాల్లో స్థిరపడి 45 ఏళ్ల క్రితం చదువుకున్న వారంతా పాత జ్ఞాపకాలను నెమరవేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత టీచర్లు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జేమ్స్ క్లబ్ ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం జెమ్స్ క్లబ్ ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కోలా చిరంజీవి మాట్లాడుతూ ఎంతో పేరు ప్రఖ్యాతులున్న జెమ్స్ క్లబ్ ద్వారా క్రీడలతో పాటు సామాజిక కార్యక్రమాలు గతంలో మాదిరిగా పునఃప్రారంభించాలని సూచించారు. ఇటీవల మృతి చెందిన పలువురు సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ లో ప్రస్తుతం నేషనల్ అండర్-19 ఆడుతున్న పంట్ల అభిరాం, పంట్ల చక్రవర్తిని ఘనంగా సన్మానించారు. అలాగే క్లబ్ సీనియర్ మెంబర్ ఇటీవల పదవీ విరమణ పొందిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మాధవరావుచౌదరి, అలాగే విశ్రాంత ఆరోగ్య మిత్ర విజయానంద్ శాంతోను సన్మానించారు. రెండేళ్ల తర్వాత ఆత్మీయ కలయిక జరగడంతో సభ్యులు రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నెల్లి శ్రీనివాస్, సీనియర్ సభ్యులు దివాకర్ మాస్టారు, కిమిడి రామరాజు, జామి దేవీప్రసాద్, లక్ష్మీ నారాయణ, ప్రకాష్, కోలా రంజిత్‌కుమార్, ఆకుల జగదీశ్వరరావు, బులుసు రవి, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌ను తప్పక ధరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోనిహనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు నివారించేందు వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. పాతచలానాలు ఉంటే కట్టించే చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది తిరుపతిరావు, సంపత్ కుమార్, నాయుడు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని శ్రీ గాయత్రి స్కూల్, కళాశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సర్దార్ గౌతు లచ్చన్న జలాశయం ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షులు మాచర్ల అనిల్, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, వీరఘట్ట ఎస్సై జి.కళాధర్ తదితరులు సంక్రాంతి సంబరాలు గురించి విద్యార్థులకు వివరించారు. అంతకుముందు విద్యార్థులచే వివిధ సినీ గేయాలతో పాఠశాల ఆవరణమంతా దద్దరిల్లిపోయింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్.లోకేష్, ప్రిన్సిపల్ ఎన్.సింహాచలం, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సాహంగా, ఉల్లాసంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉత్సాహంగా ఉల్లాసంగా యువజన ఉత్సవాల కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. యువత ఉత్తేజంతో కళా సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఉర్రూతలూగించాయి. ఆదివారం స్థానిక లైన్స్ క్లబ్‌లో యువజనుల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వయసులో పేదల చదువు కోసం విశేషంగా కషి చేసిన మహనీయ వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. యువత తమలోని సామర్థ్యాన్ని శక్తిగా మలుచుకోవాలని, నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఐఐటి, ఎన్ఐటి వంటి చదువుల్లోనూ, ఆటల్లో ప్రతిభ గల విద్యార్థులు ఉన్నారన్నారు. సమయాన్ని వృథా చేయకుండా నిరంతర ప్రయత్నం, కఠోర శ్రమతో పాటు సహనం చూపితే అద్భుతమైన జీవితంలో ఉన్నతమైన స్థానం అధిరోహించవచ్చని, యువతలో స్ఫూర్తి నింపారు. అవకాశాలను అందిపుచ్చుకొని ఎంత దూరమైనా వెళ్లి జీవితంలో స్థిరపడాలని



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



తప్పెటగుళ్లను ప్రదర్శిస్తున్న కళాకారులు



జ్యోతిప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఆయన ఆకర్షించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వంటి వాటి బారిన పడవద్దని, బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. అనంతరం కావ్య శ్రీనత్య కళాశాల బాలికల స్వాగత గీత నత్యం, ఓం నమశ్శివాయ గీతానికి నాట్యం, చింతమానుగు గూడ ఆదివాసీ కల్చరల్ టీం ఆధ్వర్యంలో బాలికల థింసా బృంద నృత్యం, పార్వతీపురం యనమల నందన జానపద తప్పిడి గుళ్లు, గాయత్రి ఆలపించిన అన్నమాచార్య కీర్తన, కోలాటం, వివిధ సాంస్కృతిక, సాంప్రదాయ నీత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలను, ధ్రువపత్రాలను సబ్ కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.ఎం.బి.రావు, కళాకారులు, యువత, విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పలుచోట్ల వివేకానంద జయంతి

ప్రజాశక్తి - కురుపాం

స్వామి వివేకానందుని జయంతోత్సవాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. జియ్యమ్మవలస మండలం టికె జమ్ములో సర్పంచ్ అడ్డాకుల భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానంద జన్మదిన వేడుకల్లో వివేకనందుని విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నామని, యువత సేవా భావానికి స్ఫూర్తి వివేకానందుడేనని అన్నారు. ఆయన అడుగు జాడల్లో యువత నడిచి, వ్యసనాలకు దూరంగా ఉండి గ్రామల అభివృద్ధికి భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం గ్రామంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు శంకర్రావు, సుగ్రీవులు, సుందరరావు, స్థానిక ఉపాధ్యాయులు జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పార్వతీపురం : వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి

ఆర్ట్ ఆధ్వర్యాన....

వివేకనందని ఆశ సాధనకు యువత కృషి చేయాలని ఆర్ట్ స్వచ్ఛంద సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ సూర్యం అన్నారు. కురుపాంలో గల ఆర్ట్స్ సంస్థ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ కోర్డినేటర్స్ చిరంజీవి, సుగ్రీవులు, వసంతకుమార్, రాధ, రజిత, రజిత, సౌజన్య, ఊర్మిళ పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : స్వామి వివేకానంద సేవలే తనకు స్ఫూర్తిదాయకమని పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని కొత్తవలసలో నందమూరి కాలనీలో 45 మంది పేదలు, వృద్ధులకు తన సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన దుప్పట్లు, స్టీల్ గ్లాసులు ఏడో వార్డు టిడిపి ఇన్చార్జి బలగ మధుసూదనరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తికి వార్డు యువత గంగరాజు, తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు.

గరుగుబిల్లి : మండలంలోని నాగూరులో స్వామి వివేకానంద విగ్రహానికి రాష్ట్ర కొప్పులవెలమ సంక్షేమ, అభివద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వివేకనందుడ్ని యువత స్ఫూర్తిగా తీసుకోని



కురుపాం : వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గౌస్

మంచి సమాజ మనుగడకు ముందడుగు వేయాలని అన్నారు.

మక్కువ : మండలంలోని వెంకటభైరిపురంలో స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.శ్రీనివాసరావు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సుమారు రూ.5వేలు విలువ కలిగిన మొక్కలను నాటారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని అరుకు పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షులు వి.సుమంత్‌నాయుడు అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఎల్లాపురంలో ఆదివారం వివేకానందుని విగ్రహానికి పూలు మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టి చైర్మన్ వ్యాఖ్యలకు సిఐటియు ఖండన

ప్రజాశక్తి - సాలూరు

ఎల్ అండ్‌టి కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సిఎండి ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలన్న నిబంధన ప్రవేశపెట్టడంపై సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎల్ అండ్‌టి సిఎండి వార్షిక జీతం సగటు అక్కడి ఉద్యోగ జీతం కన్నా 534 రెట్లు ఎక్కువని, సగటు ఉద్యోగికి ఈ సౌకర్యం ఇవ్వగలరానని సుబ్రహ్మణ్యంను ప్రశ్నించారు. ఇలా పని గంటలు అదనంగా చేయించుకొని, శ్రమ దోపిడీ కారణంగానే 2022లో క్రైమ్ బ్యూరో రికార్డు ప్రకారం 11486 మంది ఆత్మహత్యలు చేసుకోవడానికి దారితీసింది అన్నారు. ప్రస్తుతం ఉన్న 8 గంటల పని విధానం ఎన్నో పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకుందని, కార్మిక హక్కులు, సామాజిక జీవితాలపై కుట్రపూర్వమైన దాడులను రాబోయే రోజుల్లో కార్మికులంతా సమైక్యంగా ప్రతిఘటించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు బి ఈశ్వరరావు, టి.సాయి పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దేవనాపురం పంచాయతీ చాపరాయిగూడ సమీపంలో 300 లీటర్ల బెల్లం ఊటలను ఎస్సై వై అమ్మనరావు నేలమట్టం చేశారు. అనంతరం సారా డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయించినా తయారు చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల ద్వారా సారా రవాణా చేస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలన్నారు. పండగ రోజుల్లో కోడి పందాలు నిర్వహించినా, పేకాట ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోకులాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి, కోట సీతారాంపురం గ్రామాల్లో ఆదివారం గోసాలలను టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల టిడిపి నాయకులు బి.చిరంజీవులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న గోసాలల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మరిచెర్ల సంజీవరావు, దాసరి శ్రీరాములు, శెట్టి తిరుపతి నాయుడు, ఎంపిటిసి సభ్యులు చల్లారపు జగదీష్, మాజీ సర్పంచ్ ఎం.ధనుంజయనాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు ఆర్.వెంకటరమణతో పాటు పలు గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. అలాగే కోట సీతారాంపురంలో మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు కోట్లన రామకృష్ణ, సిహెచ్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు తగిలాయి. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలి ఉన్నాయి. పార్వతీపురం నుండి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పి.సీతారాంకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు బొబ్బిలి ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలియజేశారు.

జంఝావతి సాధనకు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయి సాధన కోసం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పార్వతీపురం రాయగడ రోడ్డు స్వామి వివేకానంద విగ్రహం నుంచి, ప్రాజెక్టు ఆయకట్ట గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు బైక్ ర్యాలీని ప్రారంభించారు. ముందుగా వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మాలతీ కృష్ణమూర్తి నాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ జంఝావతి ఆయకట్టు గ్రామాలైన కృష్ణపల్లి, లక్ష్మీనారాయణపురం, చినబొండపల్లి, పెదబొండపల్లి, చొక్కాపువానివలస, లచ్చిరాజుపేట, పులిగుమ్మి, మరిపివలస, నర్సిపురం తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడారు. జంఝావతి పూర్తిస్థాయి ప్రాజెక్టు సాధనకై ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఇటీవల జంఝావతి కన్నీటియాత్ర చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు, సర్పంచుల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించామన్నారు. జంజావతి సాధనకై తాము చేపట్టిన క్రతువులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తయి పూర్తిస్థాయి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తే ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. వలసలు తగ్గుతాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రాజెక్టు సాధనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సమితి ప్రతినిధులు సునీల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి సభ్యులు

భాస్కర విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు, సమితి ప్రతినిధులు వర్రి శివకష్ణ, ఈర్ల సంజీవనాయుడు, గొర్లి శ్రావణ్ కుమార్, చుక్క చంద్రరావు, అల్లు సత్యం నాయుడు, భారతనంద మహారాజ్ స్వామీజీ, చల్లారపు వెంకట్ నాయుడు, నల్ల బలరాం నాయుడు, నెల్లి లక్ష్మణనాయుడు, మంత్రపూడి వెంకటరమణ, బొమ్మినేని అప్పారావు, గొట్టాపు చిన్నం నాయుడు, బుడితి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైట్‌హాల్ట్ బస్సు నడపాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

పండగ సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సు నడపాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రయాణికులతో కలిసి ఆదివారం కొమరాడలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుండి కూనేరు వరకు మారుమూల గిరిజన ప్రాంతాలకు రాత్రి 7.15 గంటల దాటితే ఆర్టీసీ బస్సు లేకపోవడంతో లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమైన డిపో మేనేజర్ పలుమారు విన్నవించినా, గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, ప్రజాప్రతినిధులకు చెప్పినా స్పందించడంలేదని అన్నారు. రాత్రివేళల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించి ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా జిల్లాఉన్నతాధికారులు స్పందించి కూనేరుకు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మహిళలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశీలలో ప్రవాస భారతీయుడు పట్టా మోహన్ సుధీర్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఉపాధి, శిక్షణ భవనంలో ఆదివారం పేద మహిళలకు, వృద్ధులకు చీరలు, లుంగీ, తువ్వాల్లు ఆయన ప్రతినిధి అక్కేన సుందరనాయుడు పంపిణీ చేశారు. ఇప్పటికే ఆయన గ్రామంలో ఉచితంగా రక్షిత తాగునీరందించడమే కాకుండా, మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందించి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ఆయన ప్రయత్నానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు రాముడు, రామకృష్ణ, అక్కేనా పురుషోత్తం నాయుడుపాల్గొన్నారు.



వీధుల్లో బ్లీచింగ్ జల్లుతున్న పారిశుధ్య కార్మికులు

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుగుపేట, తామరకండి, పెదభోగిలి, చినభోగిలి తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ప్రజలు బాధపడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలను పచాయతీ కార్యదర్శులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం, మురుగునీరు నిల్వలను తొలగించడం, ట్యాంకులు క్లీనింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు ఎం.వెంకట నాయుడు, లలిత వెంకటనాయుడు, కె.రాధా శ్రీనివాస్, బి పద్మావతి పాటు పాల్గొన్నారు

సంతకు సంక్రాంతి శోభ

ప్రజాశక్తి - సీతంపేట

పండగ ముందురోజైన ఆదివారం సీతంపేటలో జరిగిన సంత క్రయ, విక్రయదారులతో సందడిగా మారింది. ఇప్పటికే పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు సంక్రాంతికి కావాల్సిన గుమ్మడికాయలు, కర్ర పెండ్లం, అరటిపండ్లు, పొట్టేళ్లు, గొర్రెలు, మేకలు, కోళ్ల కోసం సంతకు వచ్చారు. గిరిజన ఉత్పత్తులను మైదాన ప్రాంతవాసులు విక్రయించి తమకు కావాల్సిన వంట నూనె, బెల్లం, పంచదారతో పాటు నూతన వస్త్రాలు తదితర సామాగ్రిని గిరిజనులు కొనుగోలు చేశారు.

ఇదిలా ఉండగా సీతంపేట ఏజెన్సీలో అటవీ ఉత్పత్తులకు మైదాన ప్రాంతంలో మంచి డిమాండ్ ఉంది. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా తయారైన ఈ పంటలకు, ఫలాల్లో పోషకాలు పుష్కంగా ఉంటాయి. అందుకే మైదాన ప్రాంత వాసులు వీటి కోసం ఎగబాకుతారు. అయినా గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన ఉత్పత్తులకు మద్దతు ధర లేకపోవడంతో విలవిల ఆడుతున్నారు. గుమ్మడికాయలు సంక్రాంతికి ఎంతో అవసరం ఉంటుంది. దీంతో పాటు ఒడిస్సాలో ఎక్కువగా దీన్ని వినియోగిస్తారు. అన్ని కూరల్లో గుమ్మడికాయ



సీతంపేట సంతలో విక్రయిస్తున్న కంద దుంపలు

లేకుండా ఏ కార్యక్రమం జరగదు. సంతల్లో గుమ్మడికాయ కాయను బట్టి కొనుగోలు చేసి ఒడిశాలో కిలోలు చొప్పున విక్రయిస్తారు. ఇక పనసకాయ చొప్పున కొనుగోలు చేసి వాటిని కూడా ఒడిశాలో కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. కజ్జ పనసకు ఒడిశాలో చాలా డిమాండ్. ప్రతి శుభకార్యంలో పనసకూర లేకుండా ఉండదు. అధికంగా పనసకాయ బిర్యానీ మొగ్గుచూపుతారు. ఇక పెండ్లం గురించి చెప్పాల్సిన అవసరం లేదు. సంక్రాంతి దినాల్లో ప్రతి ఇళ్లల్లో పెండ్లం కలగాయ కూర వంటకాలు నిర్వహిస్తారు. ఇలా సంతల్లో విక్రయిస్తున్న ఈ కూరగాయల కొనుగోలు కోసం విక్రయ దారులు పెద్దఎత్తున రావడంతో సంత కిటకిటలాడింది.

కిక్కిరిసిన దుకాణాలు... తారెత్తిస్తున్న ధరలు

ప్రజాశక్తి వీరఘట్టం

సంక్రాంతి పండగ సందర్భంగా కొత్త బట్టల కోసం మండల కేంద్రంలో ఆదివారం కొనుగోలుదారులతో బట్టల షాపులు కిక్కిరిసిపోయాయి. బట్టలతో పాటు వివిధ రకాలైన వస్తువులను కొనుగోలు చేసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వీరఘట్టం చేరుకోవడంతో బట్టల షాపులు మొదలు కూరగాయలు, వివిధ వస్తువులు కొనుగోలు చేయడంతో వీరఘట్టం జనాలతో దర్శనమిస్తుంది. మరోవైపు ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు. ఎస్సై జి కళాధర్ ఆధ్వర్యంలో మిత్ర, అంబేద్కర్ జంక్షన్ వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఘాటెక్కిన కూరగాయ ధరలు

కొనుగోలుదారులను చూసి వ్యాపారస్తులు అమాంతంగా కూరగాయల ధరలు పెంచారు. తప్పని పరిస్థితుల్లో ఎంతైనా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వంకాయ కేజీ రూ.80, చిక్కుడుకాయలు రూ.60, టమాటా కిలో రూ.60, చెరుకు కర్ర రూ 30, గుమ్మడి చెక్క రూ.20, పెండలం దుంప కిలో రూ.60, మంచి నూనె ధర చెప్ప నవసరం లేదు. ధరలు అధికంగా ఉన్నప్పటికీ అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని కొనుగోలుదారులు వాపోతున్నారు.

పండగ వేళ.... రంగులకు భలే గిరాకీ

కురుపాం : పండగలు వస్తున్నాయంటే రంగులకు భలే గిరాకీ ఉంటుంది. అందులోనూ కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగ అంటే రంగుల పొడికి మరీ డిమాండ్. నేటి కాలంలో రంగుల్లేని రంగవల్లులు



కొనుగోలుదారులతో కిక్కిరిసన వస్త్ర దుకాణం

అంటూ ఎక్కడా కనిపించదు. ప్రతి ఇల్లు రంగవల్లుల శోభ సంతరించుకుంటుంది. అందుకే రంగుల పొడికి మంచి గిరాకీ ఉంటుంది. పల్లెటూరి నుంచి పట్నం దాకా రంగుల పొడిని వినియోగించడం అలవాటై పోయింది. ఈ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముగ్గుల పోటీలను నిర్వహిస్తారు. దీంతో రంగుల పొడికి మరింత గిరాకీ ఏర్పడుతుంది. దీనివల్ల చిరు వ్యాపారులకు కాస్త ఉపాధి ఉంటుంది. నేడు పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో రంగుల పొడివిక్రయాలు జరుగుతాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏ ఊరు చూసినా ఆ ఇంటి ముంగిట రంగవల్లులు ఉట్టిపడుతున్నాయి. ఏది ఏమైనా సంక్రాంతి, కొత్త సంవత్సరం వంటి రోజుల్లో రంగుల పొడికి గిరాకీ ఉంటుందని చెప్పడంలో సందేహం లేదు.